క్లుప్తంగా

ఘనంగా వీరేశ్వరస్వామి కల్యాణం



జి.అగ్రహారంలో వీరేశ్వరస్వామి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో ఉన్న ఉమాపార్వతి సమేత వీరేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి కామేశ్వరశర్మ, సుదర్శనం కేశవాచార్యుల పర్యవేక్షణలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా వెంకన్న తీర్థం



కేవీ పాలెంలో భక్తులకు దర్శనమిస్తున్న వెంకన్న

అంబాజీపేట: సిరి భూ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్థానిక కొర్లపాటివారిపాలెంలో గురువారం నిర్వహించిన తీర్థం వైభవంగా సాగింది. ఏడు వారాల వెంకన్నబాబును దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది. స్వామివారిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ దర్శించుకున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



దాత జానకిరామయ్యకు స్వామి చిత్రపటం ఇస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం పలువురు విరాళాలు అందజేశారు. చెయ్యేరుకు చెందిన త్సవటపల్లి జానకిరామయ్య, నాగభవాని రూ.25,100, హైదరాబాద్‌కు చెందిన ఉప్పలూరి లక్ష్మీశారద రూ.10,116, కాకినాడకు చెందిన మేక వెంకట హరనాథ్‌బాబు, వెంకట పద్మారాణి రూ.10,116 అందించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు ఈ విరాళాలను అందజేశారు. దాతలకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.

వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు



నాగుల్లంకలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పి.గన్నవరం: నాగుల్లంక పీహెచ్‌సీ పరిధిలో ఎస్టీ కమ్యూనిటీకి చెందిన 40 ఏళ్ల లోపు 368 మందికి గురువారం సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిని గుర్తించేందుకు రక్త పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించేందుకు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ జాసిమ్, వైవీ ప్రియాంక తెలిపారు. ఈ వ్యాధితో బాధపడే వారిలో రక్త కణాలు కుచించుకుపోయి, కొడవలి ఆకారంలోకి మారి, రక్త ప్రసరణ సక్రమంగా జరగక తీవ్ర నొప్పులు, వాపులతో బాధపడతారని వివరించారు.

పాత గుడికి సీసీ రోడ్డు



అప్పనపల్లి పాత గుడి మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి పాత గుడికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొత్త గుడి నుంచి పాత గుడికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో ఆక్రమణల తొలగింపు అధికారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఎట్టకేలకు పంచాయతీ రాజ్, దేవస్థానం సిబ్బంది ఆక్రమణల తొలగింపులో కీలకపాత్ర పోషిస్తున్నారు. నాలుగు మీటర్ల వెడల్పు, 98 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అన్యం రాంబాబు, ఆలయ ఈఓ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు.

విజ్ఞాన భాండాగారం

- గ్రంథాలయాలపై పెరుగుతున్న ఆసక్తి
- నెలాఖరు వరకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు
- 15 ఏళ్లలోపు బాలబాలికలకు అవకాశం



అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులతో గ్రంథాలయాధికారి

అంబాజీపేట: గ్రంథాలయం ఓ విజ్ఞాన భాండాగారం. విషయ పరిజ్ఞానాన్ని ప్రసాదించి.. సమాజంపై పూర్తి అవగాహన కల్పిస్తుంది. విద్యాబుద్ధుల్లో అగ్రగామిగా నిలుపుతుంది. మౌనాన్ని పోగొట్టి, అనర్గళంగా మాట్లాడిస్తుంది. అందుకే పుస్తకం.. ఓ మంచి నేస్తం. పుస్తక పఠనం అలవర్చుకుంటే కొత్త విషయాలపై పట్టు సాధించవచ్చు. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతూ, సంప్రదాయ విలువలకు దూరమవుతున్నారు. నిత్యం సెల్‌ఫోన్లతో బిజీగా గడిపే విద్యార్థులను గ్రంథాలయాలను పరిచయం చేస్తూ వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. మే నెలాఖరు వరకు విజ్ఞాన శిబిరాలు నిర్వహించడానికి ఆయా శాఖా గ్రంథాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. దీనిని వేదికగా చేసుకుని గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య, సభ్యత్వాలను పెంచడానికి కొత్తపేట డివిజన్‌లోని 11 మండలాల గ్రంథాలయ సిబ్బంది కృషి చేస్తున్నారు. అంబాజీపేట, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరు గ్రేడ్-2ల్లోను, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి, మలికిపురం, మానేపల్లి, ఆత్రేయపురం, అంగర, రాయవరం, పి.గన్నవరం, అయినవిల్లి, మానేపల్లి, గోపాలపురం గ్రేడ్-3 ల్లోను, మామిడికుదురు, రావులపాలెం, నరేంద్రపురం, కేశనపల్లి, కందికుప్ప, కొమరిపాలెం గ్రేడ్-4 ల్లోను శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి.

శిక్షణ శిబిరంలో..

ఉదయం 8 నుంచి 8.30 వరకు కథ వినడం, 8.30 నుంచి 9.30 వరకు ఆటలు, శారీరక కార్యకలాపాలు, 9.30–9.40 వరకు విరామం. 9.40–10 గంటల వరకు పుస్తక సమీక్ష, 10–10.30 వరకు గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, 10.30–11.30 వరకు స్పోకెన్ ఇంగ్లిష్/డ్రాయింగ్/పెయింటింగ్/పేపర్ క్రాఫ్ట్/మ్యూజిక్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. 15 ఏళ్ల లోపు చిన్నారులు వేసవి సెలవుల్లో గ్రంథాయాలను సందర్శించి, పుస్తక పఠనంతో పాటు, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడతాయి. శిబిరాలకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు.

వందలాది పుస్తకాలు

గ్రంథాలయాల్లో పాఠకుని అభిరుచికి తగినట్లుగా వందలాది అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. రామాయణం, భారతం, భాగవతం వంటి పురాణ ఇతిహాసాలు, డిటెక్టివ్ నవలలు, కథలు, బాల సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలు, జంతు, వృక్ష, రసాయన, భౌతిక, చరిత్ర, మనోవిజ్ఞాన శాస్త్రాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ఏపీపీఎస్సీ, బీఎస్ఆర్‌బీ, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పుస్తకాలు, గణిత, గణాంక, సామాజిక, ఆర్థిక శాస్త్ర పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటాయి. శిబిరాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, రంగవల్లులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడానికి సిద్ధం చేశారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించనున్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి



వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. గ్రంథాలయానికి వచ్చేలా విద్యార్థుల్లో ఆసక్తి కలిగిస్తున్నాం. వారికి నచ్చే కథల పుస్తకాలు, డ్రాయింగ్ తదితర వాటికి ఆకర్షితులై.. రోజూ సుమారు వంద మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

– జి.శ్రీనివాస్, రికార్డ్ అసిస్టెంట్, శాఖా గ్రంథాలయం, అంబాజీపేట

బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

మలికిపురం: రాజోలు మండలం వేగివారిపాలెం గ్రామానికి చెందిన గెద్దాడ వీర వెంకట సత్యనారాయణ అనారోగ్యంతో మంచానికి పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో వైద్య ఖర్చుల కోసం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి సమకూర్చిన రూ.20 వేల ఆర్థిక సాయాన్ని గురువారం గ్రామస్తుల సమక్షంలో ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు కడలి కృష్ణార్జున, దొంగ సత్తిబాబు, కాండ్రేగుల నాగరాజు, దొమ్మేటి రమేష్, గుబ్బల గోవర్ధన పద్మకుమారి, రాయుడు సాయిలక్ష్మి, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గరుడేశ్వర స్వామి కల్యాణం

పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన బాలా త్రిపుర సుందరీ సమేత గరుడేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. అర్చకస్వామి భైరవభొట్ల సత్యవెంకట నారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి పూజాది కార్యక్రమాలు, కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది.

అవమానపర్చారంటూ ఏఎన్ఎంల నిరసన



ముక్కామలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు

అంబాజీపేట: ఏళ్ల తరబడి వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న తమకు చదువురాదని, వేలాది రూపాయలు చెల్లించడం అవసరం లేదని తమ శాఖలోనే పని చేస్తున్న కొందరు అవమానపర్చడం భావ్యం కాదని ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యశాలల్లో వంద శాతం ఆస్పత్రుల్లో ప్రసవాల అమలుకు కృషి చేస్తూ, నిత్యం ప్రజలతో ఉంటూ.. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సేవలందించిన తమను హేళనగా మాట్లాడడం బాధాకరమన్నారు. గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహిస్తుంటే, ఇలా సోషల్ మీడియా వేదికగా చేసుకుని తమను కించపరుస్తూ మాట్లాడడం సబబు కాదన్నారు. తమ మనోభావాలను గాయపరిచేలా మాట్లాడిన వ్యక్తులు వారి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా స్వామివార్ల కల్యాణం

- ర్యాలిలో ఉమా కమండలేశ్వర స్వామి కల్యాణం
- ఘనంగా రమా సత్యనారాయణస్వామి కల్యాణ వేడుక



ర్యాలిలో ఉమా కమండలేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



ఆలయంలో రమాసత్యనారాయణ స్వామి కల్యాణం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి గ్రామంలోని ఉమా కమండలేశ్వరస్వామి, జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న రమా సత్యనారాయణ స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఆయా దేవస్థానాల కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఉదయం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారులు, పెళ్లి కుమార్తెలుగా ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు, అనంతరం రాత్రి 7 గంటలకు రమా సత్యనారాయణ స్వామివార్లకు, ఉమా కమండలేశ్వర స్వామివార్లకు కల్యాణం నిర్వహించారు. దేవస్థానం తరఫున ఈఓ రమణమూర్తి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రదానం కార్యక్రమం నుంచి తలంబ్రాల కార్యక్రమం వరకూ ప్రతి కల్యాణ క్రతువును వేద పండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే వ్యాఖ్యాన పండితులు ప్రతి ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టు వివరించారు. ఈ కల్యాణ మహోత్సవాలకు ర్యాలి, పరిసర గ్రామాల వారితో పాటు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో రమణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానికులు ఏర్పాట్లు చేశారు.

భవిష్యత్తు అవసరాలకు ఇసుక నిల్వ చేయాలి

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



రావులపాడు ఇసుక యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రావులపాలెం: ఇసుక నిల్వ యార్డుల వద్ద నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో భవన నిర్మాణ రంగ కార్మికుల ఉపాధికి, నిర్మాణ రంగం నిర్విఘ్నంగా కొనసాగేందుకు అవసరమైన ఇసుకను సమృద్ధిగా నిల్వ చేయాలని నిర్దేశించారు. గురువారం మండలంలోని రావులపాడు పూరేటి వారి చెరువు వద్ద, ఇసుక స్టాక్ యార్డ్‌ను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో భవన నిర్మాణ రంగాన్ని, కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఇసుకను నిల్వ ఉంచాలని సూచించారు. స్టాక్ యార్డులో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఉండాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయాలు ఉండరాదన్నారు. వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థ ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించడంతో పాటు, పర్యావరణానికి హాని కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక తరలింపులో వాహనాలపై రహదారి భద్రత దృష్ట్యా తార్పాలిన్ కప్పాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో ఇసుక కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకింగ్ ఉండాలన్నారు. ఇసుక ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్, రవాణా రికార్డుల నిర్వహణ అంశాలను అత్యంత పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఖర్చులు తగ్గిస్తూ, సామర్థ్యాలను పెంచాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్, ముక్తేశ్వరరావు, ఆర్ఐ సుజాత, సర్వేయర్ శివ తదితరులు ఉన్నారు.

బాకర్ హుస్సేన్‌కు గన్నవరపు పరామర్శ



బాకర్ హుస్సేన్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

మామిడికుదురు: అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకుని, నగరంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు ఆగాబాకర్ హుస్సేన్‌ను పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, పార్టీ నేతలు నీతిపూడి గణేష్‌బాబు, తోరం భాస్కర్, మొల్లేటి త్రిమూర్తులు, మట్టపర్తి శివ, కడలి శ్రీనివాస్ తదితరులు ఆయనను పరామర్శించారు.

పలువురికి పరామర్శలు

పి.గన్నవరం: మండలంలో అనారోగ్యానికి గురైన పలువురిని పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. వాడ్రేవుపల్లి గ్రామంలో ఇటీవల గుండె శస్త్ర చికిత్సలు చేయించుకున్న కొపనాతి అక్కమ్మ, చిట్టూరి సాయిబాబు, బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న తెన్నేటి ఏడుకొండలు, అనారోగ్యానికి గురైన యల్లమెల్లి రామకృష్ణను కలుసుకుని, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు విత్తనాల ఇంద్రశేఖర్, పితాని నర్సింహరావు, కొపనాతి సత్యనారాయణ, యల్లమెల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం



ఎంపికైన నూతన కార్యవర్గం

మలికిపురం: తాడి వారి సంక్షేమ సంఘం రాజోలు నియోజకవర్గ 2025–26 నూతన కార్యవర్గం ఎంపిక గురువారం జరిగింది. గౌరవాధ్యక్షునిగా తాడి మోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా తాడి శ్యామ్, ఉపాధ్యక్షుడిగా తాడి రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా తాడి రాజేష్, కోశాధికారిగా తాడి ఆరుద్ర శ్రీనివాస్, కార్యదర్శిగా తాడి రవి, ఉప కోశాధికారిగా తాడి సతీష్, సఖినేటిపల్లి మండల కన్వీనర్‌గా తాడి సహదేవ్, మలికిపురం మండల కన్వీనర్‌గా తాడి కిరణ్, రాజోలు మండల కన్వీనర్‌గా తాడి స్టీవెన్, మామిడికుదురు మండల కన్వీనర్‌గా తాడి రాంబాబు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారులుగా తాడి శ్రీనివాస్(డీసీసీబీ మేనేజర్), తాడి దీపక్ (టీచర్) వ్యవహరించారు.

ప్రతిష్టాత్మకంగా సారా నిర్మూలన

- 67 మందిపై సారా, 22 మందిపై అక్రమ మద్యం కేసులు
- ఎక్సైజ్ సీఐ కాత్యాయని



కొత్తపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సారా నిర్మూలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి, సత్ఫలితాలు సాధిస్తున్నామని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సారా సంపూర్ణ నిర్మూలన లక్ష్యంతో నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా సారా ప్రభావిత గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, కళాజాతాల ద్వారా, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సారా వల్ల అనర్థాలు, అనారోగ్య పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. సారా తయారీ, విక్రయాలు సాగించే వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటి వరకు ఐదు దశల్లో 67 మందిపై కేసులు నమోదు చేసి, 414 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నామన్నారు. 38 వేల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. అలాగే 22 మందిపై అక్రమ మద్యం కేసులు నమోదు చేసి, 45.62 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుల్లో 61 మందిని బైండోవర్ చేశామన్నారు. సారాపై ఎటువంటి సమాచారమైనా టోల్ ఫ్రీ నంబరు 14405కు లేదా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కొత్తపేట సర్కిల్ కార్యాలయం 94409 02423కు సమాచారం ఇవ్వాలని సీఐ కాత్యాయని కోరారు.

ఊబలంకలో మలేరియా కేసు గుర్తింపు



ఊబలంకలో సర్వే చేస్తున్న డీఎంఓ

రావులపాలెం: మండలంలోని ఊబలంక గ్రామంలో ఓ వ్యక్తికి మలేరియా సోకినట్టు డీఎంఓ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తి తరచూ జార్ఖండ్ రాష్ట్రం వెళ్లి వస్తుండడంతో మలేరియా సోకిందని, ఊబలంక పీహెచ్‌సీ ల్యాబ్‌లో రక్త నమూనాను పరీక్షించగా మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు. దీంతో ఆరోగ్య సిబ్బందిని మూడు బృందాలుగా విభజించి ఆ ప్రాంతంలో సర్వేలు నిర్వహించామన్నారు. జ్వర పీడితులకు రక్త పోతలు సేకరించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు నిర్వహించామన్నారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యురాలు హసీనా, సూపర్‌వైజర్లు శామ్యూల్‌రాజు, లక్ష్మణరావు, ఏఎన్ఎంలు ఉన్నారు.

కార్యదర్శులతో ఎంపీడీఓ సమీక్ష

అయినవిల్లి: పారిశుధ్యం, ఇతర సమస్యలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటసరోవర్ గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. అలాగే వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

వెండి కిరీటాల సమర్పణ

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు భక్తులు వెండి కిరీటాలు సమర్పించారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన నల్లమిల్లి ఆదిరెడ్డి, సావిత్రి దంపతుల జ్ఞాపకార్థం వారి మనవరాలు పడాల సూర్రెడ్డి, పద్మ దంపతులు వెండి కిరీటాలను సమర్పించారు. ఉత్సవ విగ్రహాలకు అలంకరణ నిమిత్తం ఆలయ ప్రధాన అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్య శర్మకు గురువారం వెండి కిరీటాలను అందజేశారు. 286.100 గ్రాముల బరువు గల రజిత కిరీటాలను పండితులు స్వామివారికి అలంకరించి పూజలు చేశారు.

దినదిన గండం

- మెండుపాలెం అవుట్‌ఫాల్ స్లూయిజ్ శిథిలం
- ఊడిపోతున్న తలుపులు
- బీటలు వారిన గోడలు
- అతీగతీ లేని పునర్నిర్మాణ ప్రతిపాదనలు



మెండుపాలెం వద్ద శిథిల స్థితికి చేరిన అవుట్‌ఫాల్ స్లూయిజ్



దెబ్బతిన్న స్లూయిజ్ సిమెంటు సపోర్టు దిమ్మలు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెం వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్ పూర్తిగా శిథిల స్థితికి చేరింది. పూర్వకాలంలో నిర్మించిన ఈ స్లూయిజ్ తలుపులు, వీటికి సపోర్టుగా ఉన్న సిమెంటు గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సపోర్టు గోడలు నిట్టనిలువుగా బీటలు తీయడంతో స్లూయిజ్ మొత్తం డ్రెయిన్‌లో కూలిపోవడానికి సిద్ధంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారు మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు ఏర్పాటు చేసిన ఈ స్లూయిజ్ పునర్నిర్మాణానికి అధికారులు ప్రణాళికను రూపొందించాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మీడియం డ్రెయిన్ల సమ్మేళనం

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌లో అనేక మీడియం, మైనర్ డ్రెయిన్లు కలుస్తాయి. వీటిపై సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు మండలాల్లోని సుమారు 17 వేల ఎకరాల ముంపు నీరు దిగాల్సి ఉంది. స్లూయిజ్ ద్వారా నీరు దిగడానికి బదులుగా సముద్రం నుంచి ఉప్పు నీరు పోటెత్తి.. దెబ్బతిన్న తలుపుల నుంచి తిరిగి డ్రెయిన్‌లోకి చేరుతోందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు.

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఇలా..

కేశవదాసుపాలెం సరిహద్దు నుంచి ప్రారంభమయ్యే శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ మామిడికుదురు మండలం వరకూ విస్తరించి, కరవాక వద్ద వైనతేయ నదిలో కలుస్తుంది. డ్రెయిన్‌లో మురుగు నీరు సక్రమంగా దిగేందుకు గతంలో ఈ డ్రెయిన్‌ను అధికారులు రెండుగా విభజించారు. ఇందులో ఓ భాగం కేశవదాసుపాలెం శివారు మెండుపాలెం వద్ద సముద్రంలో కలిసేలా అవుట్‌ఫాల్ స్లూయిజ్ అప్పట్లో నిర్మించారు.

ప్రతిపాదనలు పంపించాం

గతంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ షట్టర్ల రిపేర్లకు మాత్రమే ప్రతిపాదనలు పెట్టాం. ప్రస్తుతం స్లూయిజ్ మొత్తం పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీంతో ఈ దిశగా మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పంపించాం. సుమారు రూ.20 లక్షలకు పంపిన ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

– ఆనంద్, జేఈ, శంకరగుప్తం మేజర్ డ్రెయిన్, రాజోలు

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో



పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిన ఆటో

కాజులూరు: గొల్లపాలెం-యానాం రహదారిలో గురువారం ఓ ఆటో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన ఆటోడ్రైవర్ వాహనంలో ప్రయాణికులను ఎక్కించుకుని కాజులూరుకు బయలుదేరాడు. మండలంలోని గొల్లపాలెం-చేదువాడ గ్రామాల మధ్య రోడ్డు పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డు మలుపులో ఎదురుగా వస్తున్న మరో ఆటోను తప్పించబోయి ఈ ఆటో అదుపుతప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో వాహనంలో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. పొలం పూర్తిగా ఎండి ఉండటంతో, ఆటో బోల్తా పడకుండా కొంత దూరం కుదుపులతో వెళ్లి ఆగింది. దీంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

భారత సైనిక సత్తాకు ప్రతీక ఆపరేషన్ సిందూర్

కపిలేశ్వరపురం (మండపేట): ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిపిన ప్రతిదాడి భారత సైనిక సత్తాకు ప్రతీకగా చరిత్రలో నిలుస్తుందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టడం భారతీయుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతోందన్నారు. ఉగ్రవాదులకు సింహస్వప్నంగా నిలిచిన భారతీయ సైనికులకు చైర్‌పర్సన్ కృతజ్ఞతలు తెలిపారు.